క్లుప్తంగా

సర్టిఫికెట్ల పరిశీలనకు 12 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో మంగళవారం డీఈఈసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌కు 12 మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాల్ డా.ఏఎం జయశ్రీ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఫైనల్ అడ్మిషన్ లెటర్ అందించినట్టు చెప్పారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న మాటూరి రంగారావు

కంబాలచెరువు: ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు అన్నారు. స్థానిక వంకాయల వారి వీధిలో ఉన్న సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజమండ్రి రైజింగ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మాటూరి సిద్ధార్థ మాట్లాడుతూ పన్నుల రూపేణా వసూలు చేసే సొమ్ముతోనే ప్రభుత్వం విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. వీటిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం శంకరనారాయణ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

క్వారీ గోతులపై శాశ్వత పరిష్కారం చూపండి

మంత్రి దుర్గేష్‌కు కొండబాబు వినతి



దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ: ఏళ్ల తరబడి నెలకొన్న క్వారీ గోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌కు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కొండబాబు మాట్లాడుతూ అపాయకరంగా ఉన్న క్వారీ గోతుల్లో నీరు తోడించి, యజమానులు వాటిని వెంటనే పూడ్చాలని, ఈ మేరకు చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరారు. అనేక మంది క్వారీ గోతుల్లో పడి మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. గోతులు పూడ్చాలన్న హైకోర్టు ఆదేశాలనూ క్వారీ యజమానులు, మైన్స్ అధికారులు బేఖాతరు చేస్తున్నారని ఆరోపించారు. సున్నంబట్టి లేఅవుట్ రోడ్డును కూడా క్వారీ యజమానులు తవ్వేయడంతో, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద అడుగుల రోడ్డు నిర్మించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సున్నంబట్టి లేఅవుట్ కమిటీ ప్రతినిధులు కేవీవీ సత్యనారాయణ, టి.బాబూరావు, లక్ష్మీనారాయణ, మాసా నాని తదితరులు ఉన్నారు.

లక్ష్య సాధన దిశగా ఉపాధ్యాయ శిక్షణ



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డాక్టర్ సతీష్ రెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు లక్ష్యాన్ని సాధించే విధంగా ఉండాలని సీమాట్ ప్రొఫెసర్, టీచ్ టూల్ ప్రాజెక్టు స్టేట్ ఇన్‌చార్జి డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్‌లో తొమ్మిది రోజులుగా జరుగుతున్న టీచ్ టూల్ ఉపాధ్యాయ శిక్షణా తరగతులను రాష్ట్ర పర్యవేక్షక బృందంతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బోధనాభ్యసన కృత్యాల పరిశీలన ద్వారా బోధనను మెరుగుపరచడం, మూల్యాంకనం చేయడానికి టీచ్ టూల్ అనే సాధనం అభివృద్ధి చేసినట్టు చెప్పారు. దీనిపై హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ టీచర్, సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ లక్ష్యాన్ని అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీమాట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకరరావు, సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్, కోర్స్ డైరెక్టర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు ఎన్.శ్రీనివాస్, జె.స్వప్నప్రియ, కె.లక్ష్మణరేఖ, ప్రవీణ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

11న చెస్ పోటీలు

పెదపూడి: అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 11వ తేదీన బాలబాలికలకు జిల్లా స్థాయి అండర్–10, 15 విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎన్ఈఎస్ఎస్ సీఓ ట్రస్ట్ చైర్మన్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 81794 60178, 98850 82859 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అనుచితంగా..

- ఉచిత ఇసుక విధానం ప్రారంభం
- పని చేయని వే బ్రిడ్జి
- జేసీబీ బకెట్ లెక్కలతో ఇసుక లోడింగ్
- దోచేసిన ఇసుకపై నోరు మెదపని ప్రజాప్రతినిధులు!



బకెట్ లెక్కలతో ఇసుక లోడు చేస్తున్న పొక్లెయిన్

రాజమహేంద్రవరం రూరల్: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన నేతలు వర్షా కాలంలో ఇళ్ల నిర్మాణం కోసం స్టాక్ పెట్టిన ఇసుకను కొల్లగొట్టారు. జిల్లాలో ఏడు ఇసుక స్టాక్ పాయింట్లలో సుమారు ఎనిమిది లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉండగా, ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చేసరికి ఆయా నేతలు మాయం చేశాక సుమారు మూడు లక్షల టన్నుల ఇసుక మాత్రమే మిగిలింది. మాయమైన ఇసుక విషయంపై మాత్రం ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం గమనార్హం. లాలాచెరువు ఇసుక స్టాక్ పాయింట్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఉచిత ఇసుక విధానాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బకెట్ రెండు టన్నులు!

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వే బ్రిడ్జి పనిచేయలేదు. దీంతో జేసీబీ బకెట్ రెండు టన్నుల చొప్పున లెక్క వేసి లారీల్లో లోడింగ్ చేశారు. ఇసుక ఎక్కువ వెళితే ప్రభుత్వం, తక్కువ వెళితే వినియోగదారుడు నష్టపోవాల్సిన పరిస్థితి. ఇసుక లోడింగ్, బాట చార్జీలు తదితర ఖర్చులు కలిపి టన్ను ధర రూ.270గా కలెక్టర్ నిర్ణయించారు. ఇంటి ప్లాన్, ఆధార్ కార్డుతో యజమాని క్యూఆర్ కోడ్ ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేశాక లారీల్లో ఇసుకను లోడింగ్ చేస్తారు.

కృత్రిమ కొరత సృష్టించేలా..

వర్షాకాలంలో ఇసుక దొరికే అవకాశం లేదు. కాబట్టి అధికార పార్టీల నేతలు ఇప్పటి నుంచే సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పటివరకు స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను మాయం చేసేశారు. రూ.కోట్ల విలువైన ఇసుకను రహస్య ప్రాంతాల్లో నిల్వలు చేశారు. ఎన్నికల ముందునాటికి ఏడు స్టాక్ పాయింట్లలో 8 లక్షల టన్నులకు పైగా ఇసుక నిల్వలున్నాయి. ఇప్పుడు కేవలం మూడు లక్షల టన్నులు మాత్రమే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక విక్రయాలు పూర్తయితే, ముందు ముందు వర్షాకాలంలో ఇసుక కొరత ఉంటుంది. ఈ సమయంలో దాచేసిన ఇసుకను అధిక రేట్లకు విక్రయించేలా ఆయా నేతలు ఆలోచనలో ఉన్నారు. దోచేసిన ఇసుకపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, గతంలో జరిగిన విషయం తమకు సంబంధం లేదని, ఇప్పటి నుంచి జరిగేదే లెక్కలో ఉంటుందని చెప్పడం విశేషం.

జగన్‌ను కలిసిన గిరజాల



వైఎస్ జగన్‌ను కలిసిన గిరజాల వీర్రాజు తదితరులు

కడియం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) కలిశారు. ఎన్నికల ఫలితాలు, నియోజకవర్గ పరిణామాలను అధినేత దృష్టికి తీసుకువెళ్లినట్టు గిరజాల తెలిపారు. ఆయనతో పాటు కడియపులంక మాజీ ఉప సర్పంచ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాస్, ఏపీ పరిశ్రమల శాఖ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సర్కార్ బాష, పార్టీ నాయకుడు కొక్కిరాల వెంకటేశ్వరరావు తదితరులు జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: చవితి సందర్భంగా మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.

క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేయాలి

పెదపూడి: ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని రోజూ క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి నాణ్యతను పరిశీలించే క్లోరోస్కోపు కిట్లను సచివాలయ కార్యదర్శులకు మంగళవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని క్లోరినేషన్ చేశారా, లేదా అని క్లోరోస్కోపుతో పరీక్షించి చూడాలన్నారు. వాటర్ ట్యాంక్ ఎన్ని రోజులకు శుభ్రం చేస్తున్నారో పరిశీలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెర్మ్‌ల నిర్మాణం ప్రారంభం



దానవాయిపేటలో మొదలైన బెర్మ్‌ల నిర్మాణ పనులు

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం సిటీ: అసంపూర్తి సీసీ రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నగర ప్రజల అవస్థలపై.. దాన'వాయిదా'పేట మెయిన్ రోడ్ శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ స్పందించారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలంటూ ఇంజినీరింగ్ అధికారులకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రాజమహేంద్రవరంలో ప్రధాన సెంటర్‌గా ఉన్న దానవాయిపేట మెయిన్ రోడ్‌లో సీసీ రహదారి నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరి 20న అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.రెండు కోట్లు విడుదల చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు 4 నెలల కాలం పట్టింది, రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది, వాహనాలను రోడ్డు పైనే పార్కింగ్ చేయడంతో, పాదచారులకు సైతం ఇబ్బందికరంగా మారింది. దీనిపై వెలువడిన కథనంపై కమిషనర్ స్పందించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే బెర్మ్‌ల నిర్మాణం ప్రారంభించారు.

భరత్‌రామ్‌ను దూషిస్తే సహించం

- టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను టీడీపీ నాయకులు దూషిస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ నాయకులు బిల్డర్ చిన్నా, రొక్కం త్రినాథ్, సుందర్‌సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాజకీయాల్లో గెలుపుఓటములు సహజమని, నగర చరిత్ర తెలియని టీడీపీ నాయకులు ఐదేళ్ల పాలన చేసిన మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను దూషించడం సరైన విధానం కాదన్నారు. కళాకారుడైన భరత్‌రామ్‌ను టీడీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలతో దూషించేందుకు యత్నించడం సరైన విధానం కాదన్నారు. ఎన్డీఏ కూటమి తరఫున రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆదిరెడ్డి వాసు తనకు 72 వేల ఓట్ల మెజారిటీ వచ్చినట్టుగా ఊరంతా ఫ్లెక్సీలు వేసుకుని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. సింగిల్‌గా పోటీ చేసి ఉంటే ఆయన సత్తా ఏమిటో తెలిసేదన్నారు. అతనికి వత్తాసు పలుకుతూ ఆ పార్టీ నాయకులు.. మాజీ ఎంపీ అన్న గౌరవం లేకుండా భరత్‌రామ్‌పై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తమైతే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీగా తన మేధా శక్తితో నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశారని, ఆయనతో టీడీపీ నేతలు పోటీ పడాలంటే.. మరింత అభివృద్ధి చేసి చూపించాలి మినహా, ఆయనపై బురదజల్లడం సరికాదన్నారు. మార్కండేయస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఇన్నమూరి దీపు ఉన్నప్పుడు దాతల నుంచి వసూలు చేసిన రూ.2 కోట్లు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వ్యక్తిగత దూషణలు పక్కనపెట్టి, టీడీపీ నగరాభివృద్ధికి కృషి చేస్తే మంచిదని హితవుపలికారు.

కాలుష్య నియంత్రణకు సమష్టి కృషి



కాలుష్య నియంత్రణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కావాలని గెయిల్ (ఇండియా) లిమిటెడ్ రాజమహేంద్రవరం చీఫ్ మేనేజర్ కేవీఎస్ రావు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏవీఏ రోడ్డులో ఉచిత వాహన కాలుష్య నియంత్రణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 వాహనాలకు పరీక్షలు నిర్వహించినట్టు రవాణా శాఖాధికారి సంపత్ కుమార్ తెలిపారు.

ఆహార భద్రతపై అవగాహన అవసరం



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆచార్య సుధాకర్

రాజానగరం: ప్రతి ఒక్కరూ ఆహార భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు సరైన ఆహారాన్ని తీసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్–స్టాప్ డయేరియా క్యాంపెయిన్–2024 అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అతిసారం, దాని నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గైట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.మనోహర్‌బాబు, కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పీఓ డాక్టర్ శీలం రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ కె.సుజాత, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో నమోదైన 16 డయేరియా కేసులు రెండుకు తగ్గుముఖం పట్టాయని పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. సీతానగరంలో చికిత్స అనంతరం డిశ్చార్జి అయిన వారి ఇళ్లకు మంగళవారం డాక్టర్ చైతన్య వెళ్లి ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో నమోదైన కేసుల్లో 14 మంది చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారన్నారు. ఇద్దరు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలో నాలుగు వైద్య బృందాలు ఇంటింటికీ తిరిగి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. రెండు వైద్య శిబిరాలను మరో వారం రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. కొత్తగా డయేరియా కేసులేమీ లేవని, వ్యాధి అదుపులోకి వచ్చిందని స్పష్టం చేశారు.

పాఠశాలకు పారిశుధ్య సామగ్రి అందజేత

కంబాలచెరువు: గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక లాలా చెరువు ఉన్నత పాఠశాలకు మంగళవారం పారిశుధ్య సామగ్రిని అందజేశారు. స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో టాయ్‌లెట్ శుభ్రతకు అవసరమైన సామగ్రి, డస్ట్ బిన్లు, ఫినాయిల్ వంటివి అందజేశామని సంస్థ ఫైనాన్స్ మేనేజర్ గోపీచంద్ నాయక్, సీనియర్ ఆఫీసర్లు జి.వెంకటరమణ, అభిషేక్ కె.ఠాకూర్, సూపరింటెండెంట్ వరుణ్ ఉమాశంకర్ తెలిపారు..గెయిల్ ఇండియా ప్రతినిధులకు హెచ్ఎం ఎ.మల్లేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కడియం: తనకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను వేమగిరి గ్రామానికి చెందిన రావిపాటి వెంకటరమేష్ కడియం పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తీపర్రు గ్రామానికి చెందిన కందుల పల్లవి అనే మహిళ మంగళవారం రాజమహేంద్రవరం వచ్చారు. మార్గం మధ్యలో వేమగిరి వద్ద రూ.65 వేల విలువైన తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఈ ఫోన్ వెంకటరమేష్‌కు దొరికింది. దానిని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ సమక్షంలో బాధిత మహిళకు అందజేశారు.

ఎమ్మెల్యేకు నర్సరీ రైతుల వినతి



ఎమ్మెల్యే గోరంట్లను కలిసిన పోలరాజు, ఇతర సభ్యులు

కడియం: నర్సరీ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు పలువురు సంఘ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి అనేక సమస్యలను విన్నవించారు. మొక్కల రవాణాకు అనుగుణంగా కడియపులంక నుంచి దోసాలమ్మ కాలనీ వరకున్న రోడ్డుతో పాటు, కడియం మండలంలో నర్సరీలున్న అన్ని రోడ్లను విస్తరించి, పటిష్టంగా నిర్మించాలని కోరారు. సబ్సిడీతో నర్సరీ ఉపకరణాలు అందించాలని, తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. నర్సరీ రైతులకు రావాల్సిన పాలీహౌస్ పెండింగ్ బిల్లును మంజూరు చేయించాల్సిందిగా కోరారు. గుంతలతో ఉన్న ధవళేశ్వరం–బడుగువానిలంక ఏటి గట్టుకు త్వరితగతిన మరమ్మతులు చేయించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంఘ సభ్యులు, నర్సరీ రైతులు మార్గాని సత్యనారాయణ, బోడపాటి గోపి, తాడాల బాలమురళీకృష్ణ, గరగా నాగేశ్వరరావు, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్, వడ్లమూరి రాజేష్ తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

– డీడీఏ మోహనరావు

సీతానగరం: రైతులకు నాణ్యత లేని పురుగు మందులు, ఎరువులను దుకాణదారులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.మోహనరావు హెచ్చరించారు. మంగళవారం రఘుదేవపురం, బొబ్బిల్లంకల్లో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి.సింహాచలంతో కలిసి ఆయన తనిఖీ చేశారు. రఘుదేవపురంలో లక్ష్మీ వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్స్, బొబ్బిల్లంకలో శ్రీదేవి సత్య ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల నాణ్యత పరిశీలనకు శాంపిల్లను సేకరించారు. ఎరువుల బస్తాలను తూకం వేసి, నిర్ణీత 50 కిలోలు ఉన్నట్టు సంతృప్తి వ్యక్తం చేశారు. ధరల పట్టీలను పరిశీలించారు. రైతులకు నాణ్యత లేని ఎరువులు, పురుగు మందులు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. వీరి వెంట కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, టెక్నికల్ ఏఓ శివశ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ ఉన్నారు.

కెమికిల్‌తో అనర్థాలు

- రసాయన, పురుగు మందుల వినియోగంలో అప్రమత్తత అవసరం
- మోతాదుకు మించితే పంటకు తీవ్ర నష్టం
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయ నిపుణులు, వైద్యులు



పొలంలో మందు చల్లుతున్న రైతు

రాజమహేంద్రవరం రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. విత్తనాలు చల్లడం మొదలు వరి కోతలు చేపట్టే వరకూ వివిధ దశల్లో రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే రసాయన, క్రిమి సంహారక మందుల వినియోగం కూడా ఎక్కువగానే ఉంటోంది. అయితే.. ఈ రసాయన, క్రిమి సంహారకాలు మితిమీరితే.. పంటపై తీవ్ర దుష్ప్రభావం చూపడమే కాకుండా, రైతుల ప్రాణాలకూ ముప్పు ఉంటుందని వ్యవసాయ, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,381 హెక్టార్లలో వ్యవసాయ భూములున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రూరల్ మండలంలో 1,430 హెక్టార్లకు గాను 274, కడియం మండలంలో 1,951 హెక్టార్లకు 425 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు వివిధ పద్ధతుల్లో పంట సాగు చేయడంలో రసాయన, పురుగు మందుల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ మందుల వాడకంపై రైతులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలి. లేని పక్షంలో పంట దిగుబడి దెబ్బ తినడంతో పాటు, నష్టాల బారిన పడాల్సి వస్తుంది. రసాయన, పురుగు మందులు అధికంగా వినియోగిస్తే ప్రాణాంతకమని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై దుష్ప్రభావం తప్పదంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తప్పక వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని చెబుతున్నారు. క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గడంతో పాటు, భూములు సహజత్వాన్ని కోల్పోతాయి. దీంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటుంది. పంటలకు నీటితడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు మందులను పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది. ఉష్ణోగ్రత 25 డిగ్రీలున్న సమయంలో పంటలపై పిచికారీ చేయాలి. రైతులు కనీస జాగ్రత్తలు పాటించి, మందులను పిచికారీ చేస్తే అపాయాల నుంచి గట్టెక్కవచ్చని వైద్యులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రసాయనాల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు.
- తెగుళ్ల, పురుగు మందు కలిపి పిచికారీ చేయరాదు.
- చేతులకు గ్లౌజులు, నోటికి, ముక్కుకు మాస్కులు ధరించాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిని చేతులతో తాకరాదు. వాడిన పురుగు మందుల ఖాళీ డబ్బాలు ఎక్కడపడితే అక్కడ పడేయరాదు.
- రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ లేకుండా చూసుకోవాలి.
- ద్రావణం కలిపే డబ్బాపై సూచించిన మేరకు కానీ, వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు కానీ పిచికారీ చేయాలి.
- పిచికారీ సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- భోజనానికి ముందు సబ్బు లేదా హ్యాండ్ వాష్‌తో చేతులను శుభ్రంగా కడగాలి.
- రసాయన మందు వినియోగించే సమయంలో కడుపు మంట, దద్దుర్లు వస్తే వెంటనే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి.

మోతాదుకు మించి వాడరాదు



వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు, తగిన మోతాదులో మందును ఉదయం వేళల్లో పంటకు పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు చల్లాక, పురుగు మందు వేయరాదు. మొక్కలపై భాగంతో పాటు, కింద భాగం తడిసేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

– ఎ.భీమరాజు, వ్యవసాయాధికారి, రాజమహేంద్రవరం రూరల్

జాగ్రత్తలు పాటించాలి




పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. అస్వస్థతకు గురైన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పురుగు మందు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిలోకి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. చేతులను శుభ్రంగా కడిగిన తర్వాతే భోజనం చేయాలి. లేకుంటే రసాయన ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉంది.

– డా.కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

ఆరు వాహనాల వేలం

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సౌత్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆరు వాహనాల వేలం ద్వారా జీఎస్టీతో కలిపి రూ.43,650 ఆదాయం వచ్చిందని సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. సెబ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ సూపరింటెండెంట్ టి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేలం జరిగిందన్నారు. ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

సినిమాలు



శ్యామల: ఆ ఒక్కటీ అడక్కు
అనుశ్రీ సినిమాస్: ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్య ప్యాలెస్: దే స్పికేబుల్ మి 4
సూర్య మినీ: కల్కి 2898ఏడీ
స్వామి: మహారాజా
అశోక: కల్కి 2898ఏడీ
రాజా: కల్కి 2898ఏడీ
శివజ్యోతి: మనమే
రంభ: 14
ఊర్వశి: భారతీయుడు
మేనక: బాక్
అప్సర: కల్కి 2898ఏడీ
కుమారి: హరోంహర, కల్కి 2898ఏడీ(3 షోలు)
నామవరం:
బీఎస్ మహల్: కల్కి 2898ఏడీ
ధవళేశ్వరం:
మురళీకృష్ణ: కల్కి 2898ఏడీ
కడియం:
వెంకటసూర్య: కల్కి 2898ఏడీ